అడల్ట్స్ ఓన్లీ కథ

# ప్రతీకారం

మధులిక

ఓరగా వేసివున్న తలుపులని తొయ్యబోయి లోపలనుంచి వినిపిస్తున్న ఆ ఇద్దరి సంభాషణలో నా ప్రస్తావన వినిపించి ఆగిపోయాను.

మధులికని నేను ప్రేమించిన మాట వాస్తవం. కాని ఆమెను ఎలా వదుల్చుకోవాలా అని గత కొద్దిరోజులుగా ఆలోచిస్తున్నాను. కోట్ల ఆస్తికి వారసురాలయిన చిదంబరం కూతురిని కాదని మధులికని పెళ్ళి చేసుకోవాలనుకోవడం కోరి జేష్ఠాదేవిని వరించడమే అవుతుంది. అలాగని మధులికని తిరస్కరిస్తే నేనామె దృష్టిలో డబ్బుకి ప్రాధాన్యమిచ్చే నీచుడిగా మిగిలిపోతాను. నీకు మధులిక కావాలి. నాకు డబ్బు కావాలి. నువ్వు ఎలాగోలా ఆమెని పెళ్ళి చేసుకుంటే నాకు పెద్ద ఉపకారం చేసిన వాడివవుతావు. ఆ స్వరం గోకుల్‌ది.

ఎలా? ఆమెకి నేనంటే అసహ్యం! ఆమె కంఠంలో ప్రాణం వుండగా నాతో పెళ్ళికి ఒప్పుకోదు అంటున్నాడు దుర్గారావు.

కొన్ని క్షణాల తర్వాత గోకుల్ స్వరం మళ్ళీ వినిపించింది.

అవును. ఒప్పుకోదు. కంఠంలో ప్రాణమే కాదు ఒంటిమీద స్పృహ వుండగా కూడా ఒప్పుకోదు. అందుకే ఆమెకి స్పృహ తప్పించు.

అంటే?

''స్వీట్‌లో మత్తు మందు కలిపి దానిచేత తినిపించు. అది స్పృహ తప్పాక దాన్ని అనుభవించు''.

''స్పృహ వచ్చాక జరిగిన మోసం తెలిసి అది గొడవ చేస్తే?''


''ఏం చేస్తుంది? మహా అయితే ఆత్మహత్య చేసుకుంటుంది. లేకపోతే రాజీపడి నిన్ను పెళ్ళి చేసుకుంటుంది. అయినా నీ సరదా తీరాక అది ఏమయిపోతే నీకేం?''

భూమ్యాకాశాలు తలక్రిందులవలేదు. ఉప్పెన వచ్చి నన్ను ముంచెత్తలేదు. కాని, అవి రెండూ ఒకేసారి సంభవిస్తే కలిగేంత షాక్ నాలో కలిగింది. నేను ప్రేమించిన వ్యక్తి నన్ను ప్రేమించాడనుకుంటున్న వ్యక్తి తన స్వార్థం కోసం నన్ను అడ్డు తొలగించుకోవడం కోసం నా జీవితాన్ని నేల రాయాలనుకుంటున్నాడని అర్థమైన నాకు సుడిగుండంలో చిక్కుకున్న అనుభూతి కలిగింది.

గోకుల్ నన్నింత మోసం చెయ్య సంకల్పిస్తాడని కలలోనైనా ఊహించలేదు నేను. అతనొక పయోముఖ విషకుంభమని, అతని అందమైన చర్మం కింద ప్రవహిస్తున్నది విషమని తెలుసుకోలేని నా అమాయకత్వానికి నామీద నాకే జాలి వేసింది.

గోకుల్! నా ఆశ! నా శ్వాస! అతనితో నా ప్రేమ వయసు ఆరునెలలు. తొలి చూపులోనే మామధ్య

హోతా పద్మినీదేవి



పుట్టిన ప్రేమ కలిసి బ్రతుకుదాం అని బాసలు చేసుకునేంత గాఢంగా మారింది. అనాధ అయిన అతన్ని పెంచిన శరణాలయమే అతన్ని ఎమ్.ఎస్.సి. చదివించింది. ప్రస్తుతం చిన్న ఉద్యోగమేదో చేస్తూ తన ప్రతిభకి తెలివితేటలకి తగిన ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు.

నాకు అయిదేళ్ళ వయసులో మా అమ్మ చనిపోయింది. నాకు తల్లిని తెస్తా

నని మళ్ళీ పెళ్ళి చేసుకున్న మా నాన్న తను నా తండ్రిననే విషయాన్నే మరచిపోయాడు. సవతి తల్లి ఆరళ్ళు... ఆమె తమ్ముడు దుర్గారావు నావైపు చూసే ఆకలి చూపులు ఆ ఇంట్లో వుండడానికి విముఖత అభద్రతాభావంతో ప్రతీ క్షణం నలిగిపోతున్నాను. బాగా చదువుకుని నా కాళ్ళమీద నేను నిలబడాలనే నా ఆశ మా పిన్ని ఇంటర్‌తో నా చదువు మానిపించడంతో అడియాస అయ్యింది. ఇలాంటి అనిశ్చిత పరిస్థితిలో బ్రతుకునీడుస్తున్న నాకు ఒకే ఒక ఆశ!

గోకుల్‌కి ఉద్యోగం రాగానే నన్ను పెళ్ళి చేసుకుంటాడని పులిబోను లాంటి ఆ ఇంట్లోంచి విముక్తి కలుగ చేస్తాడని కొండంత ఆశతో వున్న నాకు అతని నిజస్వరూపం తెలియగానే అగాధంలోకి కూరుకుపోతున్నట్టుంది.

ఇంటికెలా వచ్చానో నాకే తెలియదు. ప్రపంచంలోని నయవంచన నమ్మకద్రోహం, స్వార్థం, మోసం అన్నీ కలిసి గోకుల్‌గా రూపుదాల్చి ఆ వికృత రూపం నన్ను ఝడిపిస్తోంది. నేను కొద్దిసేపు ఏడుస్తూండిపోయాను. దుఃఖోపశమనం తర్వాత నా మనస్సు తేలికపడి, ఆలోచించే శక్తి కలిగింది. నా మనసు ప్రతీకారంతో దెబ్బతిన్న పులిలా గాండ్రుమంటోంది. 'నన్ను వంచించాలనుకున్న గోకుల్‌ని దెబ్బతియ్యాలి. అవును. మోసాన్ని మోసంతోనే జయించాలి. అతన్ని తేరుకోలేని దెబ్బ కొట్టాలి'

నా మనసులో ఒక పథకం రూపు దిద్దుకోసాగింది.

★ ★ ★

అద్దం ముందు నిలబడి శ్రద్ధగా అలంకరించుకున్నాను. నా అందాన్ని చూస్తే పిన్నికి అసూయ. నేను అలంకరించుకుంటే ఆవిడకి కడుపు మంట. బొట్టు దిద్దుకుని పాపిడి వంకర లేకుండా తీసుకోడానికి నేను అద్దం ముందు నిలబడేదే రెండు నిముషాలు.

ఆ మాత్రానికే 'బోగం దానిలా ఎవరి కోసమే ఆ ముస్తాబు?' అని అరిచే పిన్ని దగ్గర భయపడే నేను ఇవాళ అరగంట సేపు ముస్తాబవడం, పిన్నినే కాదు దుర్గారావుని కూడా ఆశ్చర్యపరిచింది కాబోలు.

''ఎవడి కోసమే ఆ ముస్తాబు?'' యధాప్రకారం అరుస్తూ గదిలోకి వచ్చింది పిన్ని.

''చూడు మామయ్యా మీ అక్క!'' ఎప్పుడూ దుర్గారావుని క్రోధ తిరస్కారాలతో చూసే నేను గోముగా గారంగా అలా అనేసరికి అతను ఫ్లాటయిపోయాడు.

''ఏమిటక్కా! వూరికే నోరు పారేసుకుంటావ్? ఆడపిల్ల... అందులోనూ వయసులో వున్న అందమైన ఆడపిల్ల మధు ముస్తాబవకపోతే నువ్వు ముస్తాబవుతావా?'' నన్నే చూస్తూ వెనకేసుకొచ్చాడు.

హఠాత్తుగా దుర్గారావు పట్ల నా వైఖరి మారడంతో మా పిన్ని అనుమానంగా నన్ను చూడడం గమనించక పోలేదు నేను. సమ్మోహనంగా అతని వైపు చూసి నవ్వి ''అలా లైబ్రరీదాకా వెళ్ళొస్తాను'' అన్నాను.

''నేనూ నీతో వస్తాను'' అన్నాడు దుర్గారావు.

''నన్నెవరైనా ఎత్తుకుపోతారని భయమా? నాలుగు రోజులు ఆగు. నా పై సర్వాధికారాలు నీవే'' అన్నాను వాలుగా చూస్తూ.

''అంటే?''

''మరో నాలుగు రోజులలో శ్రావణ మాసం వస్తుంది''

''వస్తే?''

''ఆ మాసంలో బోలెడు పెళ్ళి ముహూర్తాలున్నాయి''

''మన పెళ్ళికి ముహూర్తం పెట్టించమని మా నాన్నకి చెబుతాను.''

ఆ క్షణంలో చింకి చేటంతయిన దుర్గారావు ముఖం చూస్తే నవ్వాగలేదు నాకు.

''వస్తానేం?'' చెయ్యి వూపి ముందుకి నడిచాను.

నాలోని ఈ మార్పుకి దుర్గారావు ఉబ్బితబ్బిబ్బవుతుంటే మా పిన్ని అనుమానంగా నన్ను చూడ్డం నా దృష్టిని దాటిపోలేదు.

''వున్నట్టుండి దానిలో ఈ మార్పేమిటిరా? అది నిజంగా మారిందంటావా? లేక ఏదైనా ప్లాన్‌లో వుందంటావా?'' మా పిన్ని ఖచ్చితంగా ఆమె తమ్ముడి దగ్గర అనుమానాన్ని వెలిబుచ్చే వుంటుంది.

''ఏడ్చింది. అదేం చేస్తుంది? దాన్ని మట్టి కరిపించే బ్రహ్మాండమైన పథకం నా దగ్గర వుంది. ఈ దెబ్బతో అది జీవితాంతం నా కాళ్ళ దగ్గర కుక్కలా పడి వుండవలసిందే!'' అని దుర్గారావు సమాధానం చెప్పే వుంటాడు.

నేను మనసులోనే నవ్వుకుంటూ

## అనుష్క అదృష్టం?

గ్లామరస్ హీరోయిన్‌గా అనుష్కకి ఇటీవల కాలంలో మంచి పాపులారిటీయే వచ్చినా డాన్, ఒక్క మగాడు చిత్రాలు పరాజయం పాలవడంతో ఆమెకి నిరాశ కలిగించాయి. దాంతో పాటే నిర్మాతలలో అనుష్క గురించి ఆసక్తి తగ్గడం కూడా సహజమే. అందుకనే కాబోలు తన దృష్టిని ఇప్పుడు మెల్లగా తమిళం వైపు అనుష్క మళ్లిస్తోందని ఆమె సన్నిహితులు చెప్పుకుంటున్నారు. ఆమధ్య మాధవన్ హీరోగా 'రెండు' అనే సినిమా తర్వాత అనుష్క తమిళ సినీ రంగంవైపు వెళ్లలేదు. ఇప్పుడు తిరిగి కోలీవుడ్‌పైకి దృష్టి సారిస్తోందిట. మరి అక్కడ అదృష్టం ఎలా కలిసొస్తుందో?



ముందుకి నడిచాను.

★ ★ ★

నన్ను చూసిన గోకుల్ రెప్పలార్పడం మరచిపోయాడు. అతని కళ్ళలో ఆ క్షణంలో మెరిసిన మెరుపు నా మనసుని మండించింది. నేను సమ్మోహనంగా నవ్వుతూ అడుగుపెట్టాను.

అతనింకా నన్ను అలాగే చూస్తున్నాడు. ''ఏమిటలా చూస్తున్నావ్?'' దబాయింపుగా అడిగాను.

''ఏమీలేదు'' తడబాటుగా చూపు మరల్చుకున్నాడు. నా వైపు చూసే సాహసం లేనట్టు నేల చూపులు చూస్తున్నాడు. బహుశా కళ్ళ ముందు త్రాసులో ఒక వైపు నేను, మరోవైపు చిదంబరం కూతురు కనిపిస్తున్నామేమో! అయినా నా పిచ్చిగాని అతని మనసు చిదంబరం కూతురి వైపు మొగ్గు చూపబట్టే కదా నన్ను అడ్డుతొలగించుకునే పథకం పన్నాడు?''

నేను చనువుగా అతని పక్కనే మంచం మీద కూర్చున్నాను.

''నాలో నీకేదైనా మార్పు కనిపిస్తోందా?'' తియ్యగా అడిగాను.

అతని కళ్ళలో మళ్ళీ అదే మెరుపు.

''ఇవాళ రోజా కంటే చాలా అందంగా వున్నావు''.

''అంతేకాదు, ఇవాళ చాలా సంతోషంగా వున్నాను''

''ఎందుకని?''

''నీకు త్వరలో మంచి ఉద్యోగం రాబోతోంది కనుక. మన పెళ్ళికి మార్గం సుగమమవుతోంది కనుక. కావాలనే అతని ముందు పెళ్ళి ప్రస్తావన తెచ్చాను. అతని ముఖం క్షణ కాలం కళ తప్పింది.

''ఇంటర్వ్యూ బాగా చేసినంత మాత్రాన ఉద్యోగం వచ్చినట్టేనా?''

''నాకు రాత్రి అలాగని కల వచ్చిందిలే!''

ఈమధ్య నాకు వచ్చిన కలలన్నీ నిజమవుతున్నాయి.

''అలాగా!'' బలవంతాన నవ్వేడు.

''నీకు మంచి ఉద్యోగం వచ్చాక నిజంగా నన్ను పెళ్ళి చేసుకుంటావా? లేకపోతే నన్ను మరచిపోతావా?''

''నిన్ను మరచిపోతానని ఎలా అనుకున్నావ్? నువ్వు నా ప్రాణానివి, నా జీవన సర్వస్వానివి'' అతని స్వరంలో తెచ్చి పెట్టుకున్న ప్రేమ నా మనసులోని అగ్నికి ఆజ్యం పోసింది.

నేను చేతిలోని స్వీటు ప్యాకెట్టుని ఓపెన్ చేసి అతని ముందుకి జాపాను.

''ఏమిటి విశేషం?''

''నీకు స్వీటు ఇష్టమని తెచ్చాను. తిను'' ఒక స్వీటుతీసి అతని నోటికి అందించాను.

''నువ్వు తినవేం?''

''నువ్వు తింటే నేను తిన్నట్టే''

సహజంగానే స్వీటు అంటే ఇష్టమున్న గోకుల్ మరో స్వీటు తిన్నాడు.

గతంలో మేము కలుసుకున్నప్పుడు ఎంత స్నేహంగా మాట్లాడుకునే వాళ్ళమో అలా మాట్లాడుకున్నాం. నేనెంత సహజంగా నటిస్తున్నానో, అతను అంతకంటే సహజంగా నటిస్తున్నాడు. నేను ఆ రోజు దుర్గారావుకి అతనికి మధ్య జరిగిన సంభాషణని వినివుండకపోతే అతను నన్ను ఇంకా ప్రేమిస్తున్నాడని నమ్మేంత సహజంగా.

పది నిముషాల తర్వాత అతనికి మొదటి ఆవులింత వచ్చింది. రెండు క్షణాలలో అతను పదిసార్లు ఆవలించాడు. అతని కనురెప్పలు బరువుగా మూతలు పడుతున్నాయి. అతను వున్నట్టుండి మంచం మీద వాలిపోయాడు.

''నాకు నిద్ర వస్తోంది. వేళగాని వేళ ఇంత నిద్రేమిటి మధూ?'' అతని స్వరం నిద్రాభారంగా వుంది. క్షణాలలో గాఢనిద్రలోకి జారిపోయాడు. అతన్ని కుదిపిలేపడానికి ప్రయత్నించి అతను మత్తులో మునిగిపోయాడని కన్‌ఫర్మ్ చేసుకుని గది తలుపు దగ్గరకి లాగి బయటకి వచ్చాను.

వీధి చివర కాయిన్ బాక్స్ దగ్గరకి వెళ్ళి ఒక నంబర్ డయల్ చేసాను.

''హలో! చిదంబరం స్పీకింగ్!'' అవతలి స్వరం వినగానే రుమాలుతో మౌత్‌పీసుని మూసి సాధ్యమైనంత వికటంగా నవ్వేను. తెలివైనవాడని, అందగాడని, మీ తర్వాత మీ ఆస్తిని కాపాడగల సమర్థుడని మీ అమ్మాయిని గోకుల్‌కిచ్చి పెళ్ళి చెయ్యాలనుకుంటున్నారు కదూ? కాని గోకుల్ మీరనుకుంటున్నంత మంచివాడేమీకాదు. అతను వ్యసనపరుడు. స్త్రీలోలుడు.''

''అబద్ధం!'' చిదంబరం స్వరంలో అపనమ్మకం.

''కాదు. నిజం! కావాలంటే ఇప్పుడే ఈ క్షణంలోనే అతని రూమ్‌కి వచ్చి చూడండి. అతను ఎవరో అమ్మాయితో ఒకే బెడ్‌మీద వున్నాడు'' మరో సారి వికటంగా నవ్వేను.

అవతల ఫోన్ డిస్‌కనెక్టయింది.

## ఛార్మి వేదాంతం!

ఆమధ్య వచ్చిన 'చందమామ' సినిమాలో సింధు మీనన్‌కి డబ్బింగ్ చెప్పింది ఛార్మి అంటే ఆశ్చర్యంగానే అనిపిస్తుంది. 'మన పాత్రకి మనం డబ్బింగ్ చెప్పుకోవడం సులభమే. కానీ మరొకరికి డబ్బింగ్ చెప్పడం మాత్రం కష్టం. అలాగే నేను హీరోయిన్ని అయి వుండీ మరో హీరోయిన్‌కి డబ్బింగ్ చెప్పడంలో తప్పేం లేదు' అంటుంది ఛార్మి. 'మనం పుట్టేటప్పుడు ఏమీ తీసుకురాము, అలాగే పోయేటప్పుడు ఏమీ తీసుకెళ్ళము. మనకు మిగిలేది మంచితనమే. కాబట్టి నలుగురితోనూ సఖ్యంగా వుండాలి' అంటూ వేదాంతం వల్లిస్తోంది.



బహుశా గోకుల్ గురించి నేను చెప్పింది నిజమో, అబద్ధమో నిర్ధారణ చేసుకోవడానికి బయలుదేరినట్టున్నాడు! నేను ఫోన్ పెట్టేసి గోకుల్ రూమ్‌కి వచ్చాను. అతను గాఢనిద్రలో కాదు మత్తులో ఉన్నాడు.

నేను గది తలుపులని దగ్గరకి వేసి అతని పక్కనే మంచం మీద పడుకున్నాను. అతని చేతులని నా నడుము చుట్టూ వేసుకుని అతని ముఖాన్ని నా గుండెలకి పొదువుకున్నాను. అతని స్పర్శ నాకు గొంగళి పురుగులు పాకుతున్నంత జుగుప్సని కలుగ చేస్తోంది. అతని సామీప్యం నా మనసుని తనువుని గడ్డకట్టిస్తోంది.

నా కళ్ళు వర్షించడం లేదు. కాని, మనోనేత్రం మాత్రం కన్నీరు కారుస్తోంది.

''గోకుల్‌ని ఎంత ప్రాణప్రదంగా ప్రేమించాను? అతని భార్యనై ఇన్నాళ్ళుగా కాపాడుకుంటూ వస్తున్న నా అందాన్ని యౌవనాన్ని అతనికి అర్పించాలనుకున్నాను. కాని అతను నన్ను క్రూరంగా వంచించాలనుకున్నాడు. వంచనకి వంచనతోనే సమాధానం చెప్పాలనుకున్నాను కాబట్టే నేను ఇదంతా చేస్తున్నాను?

నా అంచనా తప్పలేదు. పది నిముషాల తరువాత బయట కారాగిన శబ్దమయింది. తలుపు తట్టిన ధ్వని. నేను కళ్ళు మూసుకున్నాను. మరోసారి తలుపు కొట్టిన శబ్దం. ఈసారి అసహనంగా తలుపుని బలంగా నెట్టారెవరో.

రెండు క్షణాల తర్వాత తలుపు విసురుగా వేసిన ధ్వని నేను చప్పున మంచం మీద నుంచి లేచి కిటికీ లోనుంచి బయటికి చూసాను. రూమ్ మెట్లు దిగుతున్న ఆ నడివయసు వ్యక్తిని చిదంబరంగా పోల్చుకున్నాను. కారు స్టార్టయి వెళ్ళగానే కసిగా గోకుల్‌ని చూసి బయటకొచ్చాను.

★ ★ ★

ఇంటి మెట్లెక్కుతున్న నన్ను చూసి పిన్ని, దుర్గారావు మాట్లాడుకోడం ఆపారు.

''ఎక్కడికెళ్ళి వస్తున్నావే?'' అనుమానంగా ఆరాగాచూస్తూ అడిగింది పిన్ని.

నేను మౌనంగా గదిలోకి వెళ్ళాను. గబగబ బట్టలు సర్దుకుని బ్యాగ్‌తో బయటకి వచ్చాను.

''ఎక్కడికే? ఎక్కడికెళ్తున్నావ్?'' పిన్ని స్వరం షాకింగ్‌గా ధ్వనించింది.

''మీ అందరికీ దూరంగా ఈ విశాల ప్రపంచంలోకి''

''బయటకి వెళ్ళి ఎలా బ్రతుకుతావే? నీ బ్రతుకు కుక్కలు చింపిన విస్తరి అవుతుంది. చివరికి ఏ రెడ్‌లైట్ ఏరియాలోనో ఒళ్ళమ్ముకుని బతకవలసిందే!'' పిన్ని నోరు పెంచింది.

''నిజంగా నేను అలాగే బతకాలని భగవంతుడు నా ముఖాన వ్రాస్తే దాన్నెవరూ తప్పించలేరు పిన్నీ! ఏ స్వీటులో ఏ మత్తు మందు వుందో అని అనుక్షణం భయపడుతూ ఇక్కడ బతకలేను'' అనేసి గేటు దాటాను.

పిన్ని ఆమె పక్కనే వున్న దుర్గారావు ఎంత షాక్‌కి గురయ్యారంటే నన్ను తిట్టడం మరచిపోయి అవాక్కయి నిలబడిపోయరు. నాకు వర్తమానంపై బెంగలేదు. భవిష్యత్తు గురించి బెంగ లేదు. నా అడుగులు స్థిరంగా పడుతున్నాయి.

★ ★ ★

గోకుల్

నేను మధులికని మనస్ఫూర్తిగా ప్రేమించాను. ఆమెతో జీవితాన్ని పంచుకోవాలని ఉవ్విళ్ళూరాను. ఈలోగా ఒకరోజు లక్ష్మీదేవి చిదంబరం రూపంలో నా ఇంటి తలుపు తట్టింది. 'చిదంబరం గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్'లో ఇంటర్వ్యూకి హాజరయిన నాకు ఆయన ఉద్యోగం ఇవ్వలేదు. ఆయన కూతురిని పెళ్ళి చేసుకుంటే ఆయన వ్యాపార సామ్రాజ్యానికి వారసుడిని చేస్తానన్నాడు. ఆస్తి, అంతస్థు, సంఘంలో హోదా అన్నీ వున్న చిదంబరం తన ఒక్కగానొక్క కూతురిని అనాథ అయిన నాకిచ్చి ఎందుకు పెళ్ళి చెయ్యాలనుకుంటున్నాడో ఆయన కూతురిని చూసి వచ్చాక నాకర్థమయ్యింది.

'అనాకారి' అనే పదానికి నిర్వచనం సుమిత్ర. అడ్డదిడ్డంగా పెరిగిన శరీరంతో గున్న ఏనుగుని తలపించేలా వుంది. ఆ రాత్రి నాకు నిద్రపట్టలేదు. మధులికతో సుమిత్రని పోల్చుకోకుండా వుండలేకపోయాను. మధులికని వదులుకోలేని బలహీనత ఒకవైపు కలలోనైనా ఊహించని నన్ను కోరి వరిస్తానంటున్న అదృష్టం మరో వైపు నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. చివరికి నా చేతిలోని త్రాసు సుమిత్ర వైపే మొగ్గు చూపించింది.

ఈ పరిస్థితులలో దుర్గారావు నా దగ్గరికి వచ్చాడు. మధులికను అతను పెళ్ళిచేసుకోవాలనుకుంటున్నాడు కానీ, ఆమె నన్ను ప్రేమిస్తోంది. మధులికను మరచిపొమ్మని నన్ను బెదిరించాడు. నేను ఆలోచనలో పడ్డాను. మధులికను తిరస్కరించి ఆమె దృష్టిలో చెడ్డవాడినవడం నాకిష్టం లేదు. అందుకని అటునుంచే నరుక్కురావాలనుకున్నాను. ఆమెని లొంగదీసుకునే పథకాన్ని దుర్గారావుకి చెప్పాను. కాని కథ ఇలా మలుపు తిరుగుతుందనుకోలేదు. నేను చిదంబరాన్ని కలుసుకుని సుమిత్రని పెళ్ళి చేసుకోడం నాకిష్టమేనని చెప్పగానే ఆయన నాపై ఇంతెత్తున ఎగిరిపడ్డాడు. నేను స్త్రీలోలుడినట. నేను ఎవరో అమ్మాయితో మంచం మీద వుండగా ఆయన కళ్ళారా చూసాడుట.

నేను మధులికని ప్రేమించిన మాట నిజమే అయినా ఆ ప్రేమ హద్దులు దాటలేదు. మరి నాతో సన్నిహితంగా వుండగా ఆయన చూసిన అమ్మాయి ఎవరు? నా తల తిరిగిపోసాగింది.

''పోస్ట్!'' తలుపు సందులోంచి ఒక కవరు జారి నేలమీద పడింది.

నేను ఆ కవరుని ఓపెన్ చేసి చదవడం మొదలుపెట్టాను.

గోకుల్,

నువ్వు నన్ను ప్రేమించానన్నావు. చిదంబరం తన కూతురిని నీకిచ్చి పెళ్ళి చేస్తాననకపోతే నువ్వు ఇప్పటికీ నన్ను ప్రేమిస్తూనే వుండేవాడివేమో! నువ్వు కలలోనైనా ఊహించని అదృష్టం నీ తలుపు తట్టడంతో నేను నీకు వెగటనిపించాను. నన్ను అడ్డు తొలగించుకోడానికి నామీద ఆశ పడిన దుర్గారావు నన్ను లొంగదీసుకునే పథకం చెప్పావు. ఏమన్నావు? అతనితో శీలం కోల్పోయిన నేను ఆత్మహత్య చేసుకుంటానా? అతని సరదా తీరాక నేనమయిపోయినా ఫర్వాలేదా? ఎందుకిలా చేసావు గోకుల్? నీకు ప్రేమకంటే డబ్బే ముఖ్యమని అందుకే చిదంబరం కూతురిని పెళ్ళి చేసుకుంటున్నానని చెప్పినా సంతోషంగా నీ జీవితంలోంచి తప్పుకునేదాన్ని కదా! నువ్వు నన్ను నమ్మించి వంచించాలనుకున్నావు. అందుకే నీకు వంచనతోనే సమాధానం చెప్పాలనుకున్నాను. స్వీటులో మత్తుమందు కలిపి నాచేత తినిపించి మత్తులో మునిగిన నన్ను అనుభవించమని దుర్గారావుకి నువ్వు చెప్పిన పథకాన్ని నీకే తిప్పికొట్టాను. నువ్వు చేసిన మోసానికి ఇది ప్రతీకారం. గుడ్‌బై.

మధులిక.

నా చేతుల్లోంచి జారిపడిందా ఉత్తరం.

☆

